


# సమిధ

చీకటిలో బాణంలా దూసుకుపోతోంది రైలు. లోపలి జనాన్ని నిద్రమత్తుగా ఒళ్లు నిమురుతోంది. బయట దూరాన్ని తరుంతోంది రైలు. లోపల వాళ్లని కాలం తరుంతోంది.

కాలదూరాలకి అతీతంగా ఆలోచిస్తున్నాడు అతను.

ఉక్కబోసినట్టు అనిపించింది. కిటికీ షట్టరు పైకి లేపాలని లేచేడు. కానిస్టేబులు చేతిలో గొలుసు కదిలింది. అతని నిద్ర చెదిరి నిటారుగా కూర్చున్నాడు.

కిటికీ పైకి ఎత్తాడు.

ఝుయ్యిమని గాలీ, వర్షపుజల్లూ లోపలికొచ్చేయి. వెంటనే షట్టరు కిందికి ఒదిలేశాడు.

సర్దుకు కూర్చున్నాడు.

పది నిమిషాల తర్వాత మళ్ళీ లేచేడు.

పోలీసుకు మళ్ళీ నిద్ర భంగమైంది.

'ఎక్కడికి ?'

'బాత్‌రూంకు'

'వెళ్ళిరా....జాగ్రత్త'

చేతిలో గొలుసు వదిలేశాడు కానిస్టేబుల్. వేళ్ళాడుతోన్న గొలుసు తీసి చేతిలో ఉంగచుట్టి పట్టుకుని ముందుకు కదిలేడు.

రైలు వాయువేగంతో పోతోంది.

అతను బాత్ రూం నించి బయటి కొచ్చేప్పటికి అరగంట పట్టింది. కంపార్టుమెంటులో అందరూ ఆదమరిచి నిద్దరోతున్నారు.

రైలు వేగం తగ్గింది.

ఏదో వంతెనమీదినించి పోతున్నట్టుంది. దబదబా శబ్దం అవుతోంది.

మెరుపు — పెద్ద వురుము.

అతనిలో ఓ మెరుపు, నరాల్లో వేడి, ఏదో ఆవేశం—

కిందికి చూశాడు. చిక్కని చీకటి.

మళ్ళీ ఓ మెరుపు.

కింద వడిగా పరుగెడుతోంది నది. పయర్స్ చుట్టూ ప్రవాహం సుళ్లు తిరుగుతోంది.

ముందుకు చూశాడు.

ఇంకా చాలా పొడవుంది వంతెన. నదికి మధ్యలో నడుస్తోంది రైలు. కింద అఘాతం. నోరు తెరుచుకున్న మృత్యువులా వుంది నది.

— బందీగా బతికేకంటే చావటం మేలు.

—స్వేచ్ఛ కోసం చావటం మేలు.

రైలుకు ఓ మనిషి బరువు తగ్గింది. అది వేగాన్ని వుంచుకుని ముందుకు పోతోంది.

o o o

వాన, రాత్రి.

ఒంటరితనం.

వైరాగ్యానికి ఇంకా చాలా దూరంలో వున్న అతని వయసు నిద్రపోనివ్వటం లేదు.

లాంతరు కునుకుపాట్లు పడుతోంది.

వెగడులోని నిప్పు నివురు దుప్పటి కప్పుకుని నిద్దరోతోంది.

అతని రెప్పలు మాత్రం నిద్దరకి లొంగటం లేదు.

రెండు కట్టెలు తీసి వెగడులోకి విసిరేడు. నిద్రపోతోన్న నిప్పు రాజుకుంది. ఎర్రటి వెలుగు గదినిండా అల్లుకుంది. వెచ్చగా చేతులు కాచుకుని, చెంపలకు హత్తుకుని ముఖాన్ని వేడి చేసుకున్నాడు.

—ఊహూ యీ వేడి చాలదు.

లేచి వెళ్లేడు. కప్‌బోర్డులోంచి సీసా, గ్లాసూ తెచ్చుకుని కూర్చున్నాడు.

బయట మంట వేడి.

లోపల ద్రవం వేడి.

రెప్పలు మత్తుగా వంగుతున్నాయి. విశ్రాంతికి ఒరిగిన సిగ్గులు రెక్కలు.

బయట తలుపు కొట్టిన చప్పుడు.

మత్తు తుళ్ళిపోయింది.

—ఈ అడవిలో అర్ధరాత్రివేళ ఎవరు?

అతన్ని సంశయం పీకుతోంది.

— వెళ్ళాలా? ఒద్దా?

— వెళ్ళి తలుపు తియ్యాలా, ఒద్దా?

ఈ మీమాంసలో వుండగనే తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

చల్లని తేమగాలి తోసుకు వచ్చింది గదిలోకి.

తర్వాత అతను.

అప్పుడుగాని గుర్తుకు రాలా తలుపుకు బోల్టు వేయని విషయం.

'ఎవరు నువ్వు?'

పక్కన లోడ్ చేసిన తుపాకీ వుంది. అసంకల్పితంగా చెయ్యి గన్ మీది కెళ్ళింది.

అతను ఆజాను బాహువు.

అతను అందమైన యువకుడు.

నిలువెల్లా తడిసి, ముద్దగా ఒచ్చి అతని ముందునుంచున్నాడు.

'ఎవరు నువ్వు?' మళ్ళీ ప్రశ్న.

సమాధానంగా నవ్వేడు ఆగంతుకుడు.

ఆ నవ్వులో జీవం వుంది, జీవితం మీద ఆశ వుంది. ఆ జీవితానికి స్వేచ్ఛ కావాలనే తపన వుంది— చీకటిలో టార్చిలా వెలిగింది ఆనవ్వు.

తుపాకి చేతిలోకి తీసుకున్నాడు.

'ష్.... అక్కర్లేదు. నేను శత్రువుని కాదు'

అతని ముఖంలోని చిరునవ్వు, నిర్భీతి, కలుపుగోలుతనం, అతన్ని ఆకట్టుకున్నాయి.

తుపాకి పక్కన పెట్టేశాడు.

'కనీసం తలుపులైనా వేసిరా'

'అయాం వెరీ సారీ....'

'వెళ్ళి తలుపువేసి బోల్టు పెట్టి వచ్చేడు.

వచ్చి నెగడుముందు నిలబడ్డాడు.

చేతికి పొడుగాటి గొలుసు వుంది.

'ఎవిటిది?'

'అస్వతంత్రిత'

అతను మాట్లాళ్ళేదు.

'దీన్ని పగులగొడ్తారా... ప్లిజ్....'

అతని దగ్గరున్న అన్ని తాళాలతోనూ ప్రయత్నించేడు. చివరికి గొడ్డలి ప్రయోగించాల్సి వచ్చింది.

'మీరు శత్రువులు కాదని నమ్మకం ఏమిటి ?

'ఇద్దరు స్వదేశీయులు ఎప్పుడూ శత్రువులు కారు. ఎవడో ఒకడు ద్రోహి అయితే తప్ప...'

చొక్కా విప్పేసి నెగడుకి దగ్గరగా నిలబడ్డాడు.

'ఏవిటా ఒళ్ళంతా మచ్చలు ?'

'దేశభక్తి చిహ్నాలు.'

'అతను నవ్వుకున్నాడు.

'టవలుంటే ఒకటిస్తారా ?'

ఇచ్చేడు.

తల రుద్దుకుని, టవలు మొలకి చుట్టుకుని బట్టలు విప్పేశాడు.

'ఇదీ వేసుకోండి' పైజమా ఇచ్చేడు.

'తేంక్స్... ఇంత అప్యాయత, ఆదరణ ఎందుకు ?'

'నేను క్రిష్టియన్ని. ప్రతి క్రిష్టియనూ గుడ్ సమెరిటన్‌గా వుండాలనుకుంటాడు'

'ఉహూ... ఆమాట నేను ఒప్పుకోను. అందరూ అలా వుండరు. అసలు క్రిష్టియానిటీ పుట్టినచోటే అది లేదు'

'మీకెలా తెల్సు ?'

'చరిత్ర తెల్సిన ప్రతివాడికీ అదీ అర్థం అవుతుంది. మతం పేరిట ఎన్ని యుద్ధాలు ? ఎంత మారణహోమం ?'

'మత మౌఢ్యం ఒక్క క్రిష్టియానిటీకే పరిమితం కాదు'

'అవును. అది ఒప్పుకుంటాను. మతం ఏదైనా ఒకటే మని షినీ, మానవ సమాజాన్నీ తోసిపుచ్చితే ...'

'అది సరే, ఇంతకీ మీరిక్కడికి ఎలా వచ్చేరు ?'

చెప్పేడు.

'స్వాతంత్రియోధులన్నమాట !'

'అంత గొప్ప కీర్తి కిరీటం నాకు తగిలించకండి'

'అసలైన విప్లవవాది ఎప్పుడూ అలాగే అంటాడు'

'అదీకూడా పెద్ద బిరుదే....'

అతను చిన్నగా నవ్వేడు.

'ఈ భయంకరమైన అడవిలో, చేతిలో తుపాకీ లేకుండా అర్ధ రాత్రి అలా ప్రయాణం చేయవచ్చా ?'

'ఆ ప్రశ్న మిమ్మల్ని అడక్కూడదు.'

'అవును. నేనసలే అడక్కూడదు. నేను ఎక్స సర్వీస్ మేన్ ని అందులోనూ మీ కథ విన్నవాణ్ని'

'ఇప్పుడు ఏ సర్వీస్‌లో వున్నారు ?'

'కనబడ్డంలా.... ఫారెస్టు సర్వీస్‌లో'

అతను ఒణుకుతున్నాడు.

'మీకు వేడి కావాలి.'

నవ్వేడు.

'మీ విప్లవకారులకి ఏ దురలవాట్లూ వుండవని అంటారు. ఒక వేళ వుంటే ఓ పెగ్గు వేసుకోండి. ఒళ్లు వెచ్చబడుతుంది.'

'అందరూ అదే పొరబడతారు. విప్లవకారుడూ మనిషే. అసలు వాళ్ళకి చాందసం పనికిరాదు. ఎప్పుడేది దొరికితే అది తినాలి, తాగాలి....'

'అయితే పుచ్చుకోండి' గ్లాస్ చేతికిచ్చాడు.

'ఇది నేను సరదాగా తాగటంలేదు. అవసరం కాబట్టి తాగుతున్నాను.'

'ఇదొక్కటే కాదు. దైహిక వాంఛల విషయంలోకూడా చాందసం పనికిరాదంటారు. శారీరక వాంఛలు ఒకో అప్పుడు మనిషిని మరీ బలహీనుణ్ని చేస్తాయి. మనిషికి బయలాజికల్ నెసస్సిటీస్ తప్పవు కదండీ! వాటిని జయించా లనుకోవటం అన్నివేళలా క్షేమం కాదు. ఆ బలహీనత అసలు ధ్యేయానికే ఎసరు పెడుతుంటి. ఎటొచ్చీ ఇవి ఉద్యమాన్ని దెబ్బతీయకూడదు.'

ఆవులించేడు.

'మీకు నిద్దరొస్తోంది.'

'నో... నో... నా పెటాల్... మాట్లాడండి... ఇటీజ్ వెరీ ప్లెజంట్...'

'ఇంతకీ... మీ పేరు?'

'ఏ పేరు చెప్పమంటారు?'

అతను గట్టిగా నవ్వేడు.

'భలే!... మనిషికి ఎన్ని పేర్లుంటాయేమిటి?'

'అవసరాన్నిబట్టి మాకు అనేక పేర్లుంటూ వుంటాయి'

'అయితే ఏదో ఒకటి చెప్పండి'

'మీరు ఆత్మీయులైపోయారు నాకు. అంచేత అసలుపేరే చెబుతాను. రమణ'

'తేంక్యూ... నాపేరు డేవిడ్'

'ఇట్స్ వెరీ నైస్...'

కరచాలనం చేసుకున్నారు.

రమణకు కళ్లు మూతలు పడుతున్నాయి. పెద్దగా ఆవులించేడు.

'మీరు బాగా అలిసిపోయేరు. అలా పక్కమీద పడుకోండి...'

'నోనో... అక్కర్లేదు. నేనిక్కడే ఓ కునుకు తీసెయ్యగల్ను. అలవాటే...'

'అయినా నేను ఒప్పుకోను'

రమణని లేపుకెళ్ళి పక్కమీద పడుకోబెట్టాడు దేవిడ్.

ఆ భయానక రేయి క్రమంగా తరుగుతోంది. పక్కన నెగడు మండి ఆరిపోయింది. అలా కుర్చీలోనే కునుకు పట్టేసింది దేవిడ్ కు.

తలుపు కొట్టిన చప్పుడు.

ఉలిక్కిపడి లేచేడు.

'ఎవరు ?....'

'ఆయాం డియస్పీ విక్టర్...'

అమాంతం లేచి కూర్చున్నాడు రమణ. తుపాకీ తీసుకుని తలుపు దగ్గరి కెళ్ళబోయాడు.

'ష్.... డోంట్ బీ హేస్టీ....'

తుపాకి తీసి పక్కనపెట్టి, అతన్ని మళ్ళీ పక్కమీద పడుకో బెట్టి రగ్గు ముసుగుపెట్టి —

'ఫర్ గాడ్స్ సేక... లేవద్దు...' అన్నాడు.

'వెళ్ళి తలుపు తీసేడు.

నలుగురు మనుషులు లోపలి కొచ్చేరు. వాళ్ళతోబాటు దుష్ట వాయువు లోపలికొచ్చి క్షణం వొణికించింది అతన్ని.

'హవ్వార్యూ మిష్టర్ దేవిడ్...' పరామర్శించేడు డియస్పీ.

'ఫైన్....'

'ఈ రాత్రికి ఇక్కడ రెస్ట్ తీసుకోవచ్చా ?'

'బై ఆల్మీన్స్...'

'ఏమిటి ఇంత రాత్రివేళ వచ్చారు ?'

'పాడు వుద్యోగం ఏం చేయాలి ? ఎవడో టెర్రరిస్టు పట్టుబడినట్టే పట్టుబడి పారిపోయాడుట. ఉన్నపళంగా పోయి పట్టుకోమంటారు. వాడేం మనకోసం రెడీగా వున్నాడా పట్టుకోడానికి ?'

'తెల్లవారేక గాలింపు మొదలెట్టాలి'

'దట్స్ బెటర్...'

'ఎవరా పక్కమీద ?'

'నా మిత్రుడు. నాలుగు రోజుల క్రితం నన్ను చూడ్డానికొచ్చేడు. మలేరియా తగులుకుంది'

'లేపుతా నుండండి'

'నో... నో... నాట్నెససరీ... పడుకోనివ్వండి. వుయ్ విల్ మేక్ అవరోన్ అరేంజ్‌మెంట్స్...'

*       *       *

కుర్చీలోనే మళ్ళీ కునుకు పట్టేసింది డేవిడ్‌కు. కళ్ళు విప్పేప్పటికి తెల్లటి వుదయం గదినిండా పరుచుకుంది. బయట పక్షుల కలకల గానం విన్పిస్తోంది.

గదిలో పోలీసులు మత్తుగా నిద్రోతున్నారు.

పక్కవైపు చూశాడు. రమణ లేడు. తన పక్కనున్న తుపాకీ కూడా మాయమైంది.

డేవిడ్‌కు కోపం వచ్చింది. అతనికి కొన్ని నైతిక కట్టుబాట్లున్నాయి. ఏమైనా సహిస్తాడుగాని మోసాన్ని మాత్రం సహించలేడు.

— వీడు విప్లవకారుడు కాదు క్రిమినల్.

పక్కనున్న పోలీస్ తుపాకీ తీసుకుని బైట పడ్డాడు. కిటికీ

క్రింద వగులగొట్టేసి గొలుసు కాలికి తగిలించి ఒక్క తన్ను తన్ని ముందుకు పరుగెత్తాడు.

దూరంగా కొండ ఎక్కుతూ కన్పించేడు రమణ. భుజాన్న తుపాకి వేళ్ళాడుతోంది. పిచ్చిగా పరుగెత్తాడు డేవిడ్.

'ఏయ్... స్టాప్...' రమణవైపు తుపాకీ గురిపెట్టి అరిచేడు డేవిడ్.

చటుక్కున తుపాకి చేతిలోకి తీసుకుని వెనక్కి తిరిగేడు. రమణ।

మళ్ళీ యథాస్థానంలో పెట్టేసుకుని నవ్వేడు.

'హేండ్సప్... డ్రాప్ ది గన్...'

తుపాకీ కింద పారేశాడు. నవ్వుతూనే రమణ ముందుకు వెళ్ళేడు.

'ఎందుకు చేశావీ పని?'

'తప్పనిసరై। మీరేగా అన్నారు తుపాకి లేకుండా అడవిలో ప్రయాణం చేయగూడదని'

అంటే? నాకే ఎసరు పెడతావా? ఇది లేకుంటే నేనేమై పోతాను?'

'మీరు ఇంకోటి సంపాదించుకోవచ్చు. ప్రస్తుతం ఇది నాకు అవసరంగా....'

'నన్నెందుకు అడగలేదు?'

'అవకాశం లేదు. మిమ్మల్ని అడగాలంటే నిద్ర లేపాలి. మిమ్మల్ని లేపితే వాళ్ళు లేవ్వచ్చు' అన్నాడు రమణ నవ్వుతూనే.

ఆ నవ్వుకు సమ్మోహితుడవుతున్నాడు డేవిడ్. జీవితంమీద అతని నిర్లక్ష్యతకి మనసులోనే నివాళు లర్పిస్తున్నాడు.

'వాళ్లు లేచేరంటే ప్రమాదం తుపాకీ తీసుకోండి. వెళ్ళిపోవాలి'

'వాళ్ళింకా లేవర్లే .. మంచి మత్తులో వున్నారు. ఇంతకీ ఇప్పుడెక్కడికి కెల్తారు ?'

'అదీ మీకు చెప్పకూడదు'

'దట్సాల్ రైట్... వెళ్ళిపోండి... తుపాకీ తీసుకోండి. ఇది కూడా...' మరికొన్ని తూటా లిచ్చేడు.

వాటిని జేబులో నింపుకుని—

'తేంక్స్' అన్నాడు రమణ.

'ఊఁ... ఇంతకంటె నేను నా దేశానికి ఏమీ చెయ్యలేను. స్వేచ్ఛకోసం మీరు చేసే పోరాటంలో నేను పాలోలేను. మీరు చేసే యీ మహా యజ్ఞంలో నేనూ ఒక సమిధను వేశానని సంతృప్తి పడతాను. తీసికెళ్ళండి...'

ఇద్దరూ కౌగలించుకున్నారు.

'ఊ.. గో యె హెడ్... క్విక్....'

రమణ పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయేడు

'గాడ్ సేవ్ యూ యంగమేన్' అంటూ గుండెలమీద రెండుసార్లు క్రాస్ చేసుకుని వెనక్కి తిరిగేడు. వొకదానివెంట ఒకటి గుళ్లు అతని గుండెల్లోంచి దూసుకుపోయాయి.

'మెగాడ్... సేవ్....'

అక్కడే వొరిగిపోయేడు దేవిడ్.

అతని శవంమీంచే ఇనుప పాదాలు ముందుకు పరుగెత్తాయి.

★